సాక్షి
జోగులాంబ గద్వాల

శనివారం । 28 । సెప్టెంబర్ । 2024



కూర'గాయాలు'..

మార్కెట్‌లో అన్ని రకాల కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి.

వివరాలు 10లో ▸



నిరీక్షణకు తెర..

డీఎస్సీ–2008 అభ్యర్థుల నియామక ప్రక్రియ ప్రారంభమైంది.

వివరాలు 12లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
33.2 /24.1

వాతావరణం

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



గద్వాల రూరల్‌/ఎర్రవల్లి: విద్యార్థుల చదువు, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్‌ నర్సింగరావు అన్నారు. శుక్రవారం గద్వాల మండలం వీరాపురం సమీపంలోని గిరిజన సంక్షేమ బాలికల జూనియర్‌ కళాశాల, పాఠశాలను, ఎర్రవల్లి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని అదనపు కలెక్టర్‌ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో నాణ్యమైన విద్య ఎంతో ముఖ్యమని, విద్యాప్రమాణాలు మెరుగుపర్చేలా ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలన్నారు. చదువుతో పాటు విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. భోజన నాణ్యత విషయంలో రాజీపడొద్దని సూచించారు. పాఠశాల పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ప్రిన్సిపల్‌ శ్రీరేఖ, ఎస్‌ఓ ఆసియాబేగం, ఉపాధ్యాయులు శివప్రసాద్‌, యశోద తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరాలో ఇబ్బంది లేకుండా చూడాలి



గద్వాల రూరల్‌: గ్రామాల్లో మంచినీటి సరాఫరాలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని, ఒకవేళ సమస్య వచ్చినా వెంటనే మరమ్మతు చేపట్టి ప్రజలకు స్వచ్ఛమైన నీరిందించాలని జెడ్పీ డిప్యూటీ సీఈఓ భాగలక్ష్మి, మిషన్‌ భగీరథ ఈఈ శ్రీధర్‌ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పాత ఎంపీడీఓ కార్యాలయంలో మిషన్‌ భగీరథ విభాగం ఆధ్వర్యంలో మంచినీటి సహాయకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. నాలుగురోజుల పాటు గద్వాల మండలంలోని ఆయా గ్రామాల్లో పని చేసే మంచి నీటి సహాయకులకు నల్లాపైపులు, లీకేజీలు, మరమ్మతుల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు.ముగింపు కార్యక్రమానికి వారితో పాటు ఎంపీడీఓ ఉమాదేవి పాల్గొన్నారు. అనంతరం శిక్షణ పొందిన సహాయకులకు సర్టిఫికెట్లు అందజేశారు.

అమాత్యుల హామీతో.. సాగునీటిపై ఆశలు

ఉమ్మడి జిల్లాలో ఊపందుకోనున్న ప్రాజెక్టుల పనులు



నెట్టెంపాడు ఎత్తిపోతల ప్రాజెక్టు గుడ్డెందొడ్డి మొదటి లిఫ్టు

> వలసలకు నెలవైన ఉమ్మడి పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేయాలనే తలంపుతో జలయజ్ఞంలో భాగంగా చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులు.. దశాబ్దంన్నరకు పైగా పూర్తికాకుండా పెండింగ్‌లో కొనసాగడం బాధాకరం. వచ్చే ఏడాది నాటికి అసంపూర్తి పనులన్నీ పూర్తిచేసి ప్రాజెక్టుల పరిధిలోని పూర్తిస్థాయి ఆయకట్టుకు సాగునీరు అందిస్తాం.
>
> ⇨ మంగళవారం ఉమ్మడి జిల్లా ప్రాజెక్టుల పరిశీలనలో భాగంగా రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు

- వచ్చే ఏడాది పూర్తిస్థాయి ఆయకట్టుకు సాగునీరు
- 18 ఏళ్లుగా సా..గుతున్న పనులకు లభించనున్న మోక్షం
- ఆనందం వ్యక్తం చేస్తున్న ఆయకట్టుదారులు

గద్వాల: బీడు భూములకు సాగునీటిని పారించి వలసల జిల్లాగా పేరొందిన పాలమూరు వరస మార్చాలనే తలంపుతో అప్పటి ముఖ్యమంత్రి దివంగత నేత వైఎస్‌ రాజశేఖరరెడ్డి జలయజ్ఞంలో భాగంగా పెద్దఎత్తున సాగునీటి ప్రాజెక్టులు మొదలుపెట్టారు. కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్‌ ప్రాజెక్టుల ద్వారా 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. అయితే గత పదేళ్లుగా పాలకులు ఈ ప్రాజెక్టు కింద చేయాల్సిన పనులను పూర్తిచేయకుండా వదిలేయడంతో పెండింగ్‌లో కొనసాగుతూనే ఉన్నాయి. ఫలితంగా ప్రాజెక్టుల కింద 6 లక్షల ఎకరాలకు మాత్రమే సాగునీరు పారుతున్న పరిస్థితి. ఈ నేపథ్యంలో సాగునీటి పారుదల శాఖ మంత్రి అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తి చేస్తామని చెప్పడంతో ప్రాజెక్టుల పరిధిలోని ఆయకట్టుదారుల్లో ఆశలు చిగురించాయి.

4.50 లక్షల ఎకరాల లక్ష్యంతో..

నాగర్‌కర్నూల్‌ జిల్లాలో 4.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో చేపట్టిన కల్వకుర్తి ఎత్తిపోతల ప్రాజెక్టు పనులు అసంపూర్తిగా కొనసాగుతుండగా ప్రస్తుతం ఆ ప్రాజెక్టు కింద 2.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు. ఇందుకోసం మొత్తం 5 పంపులు ఏర్పాటు చేయగా.. వివిధ కారణాలతో ఐదు పంపులలో కేవలం రెండు మాత్రమే పనిచేస్తుండగా.. మిగిలిన మూడు పంపులు మరమ్మతుకు నోచుకోక మూడేళ్లుగా మూలనపడ్డాయి. అసంపూర్తి పనులు పూర్తిచేస్తే మిగిలిన 2లక్షల ఎకరాల ఆయకట్టు కూడా సాగులోకి వస్తుంది.

మరమ్మతుల్లో.. ర్యాలంపాడు

నెట్టెంపాడు ఎత్తిపోతలలో భాగంగా నిర్మించిన ర్యాలంపాడు జలాశయం ఈ ప్రాజెక్టుకు గుండెకాయవంటిది. అయితే రాక్‌టోల్‌, తూములు, ఆనకట్ట బండ్‌లో లీకేజీలు ఏర్పడటంతో మూడేళ్లుగా 2 టీఎంసీలు మాత్రమే నిల్వ చేస్తూ వస్తున్నారు. దీంతో ఈ జలాశయం కింద ఒక పంట అంటే ఖరీఫ్‌లో మాత్రమే సాగునీరు అందిస్తున్నారు.

భీమాది అదే దారి..

నారాయణపేట జిల్లాలో 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో చేపట్టిన భీమా ఎత్తిపోతల పథకం పనులు సైతం అసంపూర్తిగానే ఉన్నాయి. ఫలితంగా పూర్తిస్థాయి ఆయకట్టుకు సాగునీరు అందించలేని పరిస్థితి దాపురించింది.

వివిధ దశల్లో పాలమూరు


పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు సైతం వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. సివిల్‌, మెకానికల్‌ పనులు చేయాల్సి ఉంది. అలాగే పలు రిజర్వాయర్ల కింద భూ సేకరణకు సంబంధించి సమస్యలు ఆటంకంగా మారాయి. ఈ క్రమంలోనే ఉదండాపూర్‌ రిజర్వాయర్‌ పరిశీలనకు వచ్చిన మంత్రులకు నిర్వాసితుల నుంచి నిరసనలు ఎదురైన విషయం తెలిసిందే.

పది శాతానికే పదేళ్లు..

జోగుళాంబ గద్వాల జిల్లావ్యాప్తంగా 2 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం చేపట్టారు. అయితే పదేళ్ల కిందటే ప్రాజెక్టు పరిధిలో 90 శాతం పూర్తి కాగా.. మిగిలిన పనులు పూర్తి చేయడంలో పాలకులు నిర్లక్ష్యం ప్రదర్శించారు. అయితే పదేళ్ల కిందట ఈ ప్రాజెక్టు పరిధిలోని గుడ్డెందొడ్డి, ర్యాలంపాడు జలాశయాల కింద 1.45 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తున్నారు. వినియోగంలోకి వచ్చిన పంపుల నిర్వహణ సైతం పట్టించుకోకపోవడంతో మోటార్లలో సాంకేతిక సమస్య తలెత్తి మొరాయించడంతో నీటి పంపింగ్‌కు ఆటంకాలు తలెత్తడం పరిపాటిగా మారింది.

అసంపూర్తిగానే కోయిల్‌సాగర్‌

మరికల్‌, ధన్వాడ, చిన్నచింతకుంట, దేవరకద్ర మండలాల పరిధిలో రెండు పంటలకు 50 వేల ఎకరాల సాగునీరు అందించే లక్ష్యంతో కోయిల్‌సాగర్‌ ఎత్తిపోతల ప్రాజెక్టు చేపట్టారు. అయితే నిర్మాణం చేసినప్పటి నుంచి కోయిల్‌సాగర్‌ ప్రాజెక్టుకు సమస్యలే ఎదురవుతున్నాయి. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా పనులు పూర్తిచేయంలో విఫమలమవడంతో ఇప్పటికీ పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. పైగా జూరాల ప్రాజెక్టుకు భారీ వరద వచ్చే సమయంలో మోటారు పంపులలో సాంకేతిక సమస్యలు తలెత్తడం తరుచుగా జరుగుతుంది. ఇక్కడ కూడా నిర్వాహణ లోపమే ప్రధాన కారణం.



కోయిల్‌సాగర్‌ ప్రాజెక్టు

పోరాటయోధుడు కొండా లక్ష్మణ్‌ బాపూజీ



ఆచార్య కొండా లక్ష్మణ్‌ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న కలెక్టర్‌ బీఎం సంతోష్‌

గద్వాల: తెలంగాణ ప్రజల హక్కుల కోసం పోరాడి జీవిత చరమాంకం వరకు కృషి చేసిన గొప్ప ఉద్యమశీలి ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ అని కలెక్టర్‌ బీఎం సంతోష్‌ అన్నారు. శుక్రవారం కొండా లక్ష్మణ్‌ బాపూజీ జయంతి పురస్కరించుకొని ఐడీవోసీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన ఎనలేని సేవలను స్మరించుకున్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి సాయుధ పోరాటం నుంచి రాజకీయ పోరాటం వరకు ఆయన చూపిన స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శనీయమని అన్నారు. ఆయన చూపిన మార్గం విలువలు అందరు అనుసరించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌ నర్సింగ్‌రావు, ఏవో వీరభద్రప్ప, జెడ్పీసీఈవో కాంతమ్మ, రమేష్‌బాబు, సరోజ, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

అదనపు కోర్టు ఏర్పాటు చేయాలి



హైకోర్టు జడ్జిని సత్కరిస్తున్న అలంపూర్‌ న్యాయవాదులు

అలంపూర్‌: అలంపూర్‌లో అదనపు జూనియర్‌ సివిల్‌ జడ్జి కోర్టును ఏర్పాటు చేయాలని హైకోర్టు న్యాయమూర్తిని న్యాయవాదులు కోరారు. హైదరాబాద్‌లోని హైకోర్టు జడ్జి, జిల్లా పోర్టుఫోలియో జడ్జి పుల్ల కార్తీక్‌ను అలంపూర్‌ కోర్టు న్యాయవాదులు శుక్రవారం కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు మలిపెద్ది సురేష్‌ కుమార్‌ హైకోర్టు జడ్జిని శాలువాతో సత్కరించారు. అలంపూర్‌లో అదనపు జూనియర్‌ సివిల్‌ జడ్జి కోర్టును ఏర్పాటు చేయాలని న్యాయవాదులతో కలిసి వినతి పత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. ఇక్కడి కోర్టులో వందల కేసులు పెండింగ్‌లో ఉంటున్నాయని, కక్షిదారులకు న్యాయం అందించడంలో ఆలస్యం అవుతుందని, అదనపు జూనియర్‌ సివిల్‌ జడ్జి కోర్టును ఏర్పాటు చేస్తే సత్వరం న్యాయం అందించడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. దీనికి వారు సానుకులంగా స్పందించి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్తానని చెప్పినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర బార్‌ కౌన్సిల్‌ సభ్యులు కొండారెడ్డి, న్యాయవాదులు గవ్వల శ్రీనివాసులు, నర్సిహ్మ, యాకోబు, నాగయ్య తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులు లేక పాఠశాలకు తాళం



పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

అయిజ: మండలంలోని తొత్తినోనిదొడ్డి గ్రామంలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు టీచర్లను నియమించడం లేదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు శుక్రవారం పాఠశాలకు తాళం వేసి ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ.. మొత్తం ఏడుగురు ఉపాధ్యాయులు ఉండాల్సిన చోట కేవలం ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక ఉపాధ్యాయుడు కాంప్లెక్స్‌ మీటింగ్‌కు వెళ్తే పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడు మాత్రమే ఉంటారని వాపోయారు. ఉపాధ్యాయుల కొరత ఉండడంతో విద్యార్థులు చదువులో వెనకబడిపోతున్నారని మండిపడ్డారు. మొత్తం ఏడు తరగతులకు ఏడుగురు ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్‌ చేశారు. ధర్నా విషయం తెలుసుకున్న ఎంఈఓ దయాల్‌ రాములు, కాంప్లెక్స్‌ హెచ్‌ఎం తిమ్మారెడ్డి అక్కడికి చేరుకొని విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు నచ్చచెప్పి పాఠశాలకు వేసిన తాళం తీయించారు. ఆ పాఠశాల నుంచి రిలీవ్‌ అయిన ఒక ఉపాధ్యాయుడితో మాట్లాడి తొత్తినోనిదొడ్డి పాఠశాలలోనే మరికొంత కాలం పనిచేసే విధంగా కోరారు.

సోమశిలకు జాతీయ ఖ్యాతి



సంగమేశ్వర ఆలయం

- జాతీయ స్థాయిలో ఉత్తమ పర్యాటక గ్రామంగా అవార్డు
- ఆధ్యాత్మికత, పర్యాటకానికి నిలయంగా గుర్తింపు
- తాజా పరిణామాలతో మరింత అభివృద్ధికి అవకాశం

సాక్షి, నాగర్‌కర్నూల్‌: ఒకవైపు కృష్ణమ్మ సోయగాలు.. పచ్చని నల్లమల అడవి అందాలు.. మరోవైపు ఆధ్యాత్మిక సౌరభాలతో ఆకట్టుకునే సోమశిల గ్రామానికి జాతీయ స్థాయిలో ఖ్యాతి దక్కింది. నాగర్‌కర్నూల్‌ జిల్లా కొల్లాపూర్‌ మండలం సోమశిలకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ పర్యాటక గ్రామంగా అవార్డు దక్కింది. 'ఆధ్యాత్మికత– వెల్‌నెస్‌' కేటగిరీలో అవార్డుకు ఎంపిక కాగా, శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో ఉపరాష్ట్రపతి జగదీశ్‌ ధన్‌కర్‌, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్‌ షెకావత్‌ చేతులమీదుగా జిల్లా పర్యాటక శాఖ అధికారి నర్సింహ అవార్డును అందుకున్నారు. గ్రామీణ పర్యాటకాన్ని ప్రోత్సహించడంలో భాగంగా 2023 నుంచి కేంద్ర ప్రభుత్వం ఉత్తమ పర్యాటక గ్రామాలకు అవార్డులను ప్రకటిస్తోంది. ఇందులో భాగంగా గ్రామాల్లోని చారిత్రాత్మక, ఆధ్యాత్మిక కట్టడాలు, ఆస్తులను పరిరక్షిస్తున్న గ్రామాలను గుర్తిస్తోంది. ఈసారి అవార్డుల ఎంపిక కోసం దేశవ్యాప్తంగా మొత్తం 991 గ్రామాల నుంచి వచ్చిన దరఖాస్తుల్లో 36 గ్రామాలు ఉత్తమ పర్యాటక గ్రామాలుగా ఎంపికయ్యాయి. వాటిలో సోమశిల ఆధ్యాత్మికత– వెల్‌నెస్‌ కేటగిరిలో జాతీయ స్థాయిలో ఉత్తమ పర్యాటక గ్రామం అవార్డు దక్కింది.

> **అభివృద్ధి చేస్తాం..**
>
> సోమశిలకు జాతీయ స్థాయిలో ఉత్తమ పర్యాటక గ్రామంగా గుర్తింపు రావడం గర్వకారణం. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణలోని దర్శనీయ ప్రాంతాలను మరింత అభివృద్ధి చేస్తాం. సోమశిల గ్రామాన్ని, నల్లమల ప్రాంతాలను టూరిస్ట్‌ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దుతాం. పర్యాటకంగా అభివృద్ధి చేయడంతోపాటు తెలంగాణ కళలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషిచేస్తోంది.
>
> – జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ఎక్సైజ్‌, పర్యాటక శాఖ మంత్రి

పెరుగుతున్న పర్యాటకుల తాకిడి

కృష్ణాతీరం, నల్లమల కొండల నడుమ ఉన్న ఈ గ్రామం చుట్టూ ఉన్న ప్రకృతి రమణీయ దృశ్యాలు పర్యాటకులను ఆకట్టుకుంటాయి. నల్లమల కొండల నడుమ హొయలు ఒలుకుతూ సాగే కృష్ణమ్మ నీలం రంగు సంతరించుకుని పర్యాటకులకు కనువిందు చేస్తుంది. ఈ క్రమంలో కృష్ణానదిలో బోటులో విహరించేందుకు వస్తున్న పర్యాటకుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. అమ్రాబాద్‌ టైగర్‌ రిజర్వ్‌ పరిధిలో, కృష్ణమ్మ చెంతన ఉన్న ఈ గ్రామం చారిత్రక, ఆధ్యాత్మికత కట్టడాలకూ నిలయంగా ఉంది. శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ముంపునకు గురికానున్న లలితా సోమేశ్వర ఆలయాన్ని ఈ గ్రామంలోనే తిరిగి నిర్మించారు. పురాతన కాలం నాటి ఈ ఆలయ నిర్మాణ శైలి చెక్కుచెదరకుండా పురావస్తు శాఖ ఆధ్వర్యంలో ఒక్కో రాయిని నది ఒడ్డుకు చేర్చి అచ్చం అలాగే పునర్నిర్మాణం చేపట్టారు. సోమశిలకు సమీపంలో కృష్ణానదిలో ఉన్న సంగమేశ్వర ఆలయానికి పురాతన కాలం నుంచి ప్రాశస్త్యం ఉంది. సప్తనదుల సంగమ క్షేత్రంగా ఈ ఆలయం ప్రాచుర్యం పొందింది. ఎండాకాలంలో శ్రీశైలం రిజర్వాయర్‌లో నీరు తగ్గినప్పుడు మాత్రమే సంగమేశ్వరుడు భక్తులకు దర్శనమిస్తాడు. టెంపుల్‌ టూరిజంతోపాటు ప్రకృతి సిద్ధమైన అందాలను ఆస్వాదించేందుకు.. పర్యాటకంగా మరింత అభివృద్ధిపర్చేందుకు ఈ ప్రాంతంలో విస్తృత అవకాశాలు ఉన్నాయి. సోమశిలకు జాతీయ స్థాయిలో ఉత్తమ పర్యాటక గ్రామంగా గుర్తింపు రావడంతో పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందనుంది.



సోమశిలలోని కాటేజీలు, కృష్ణాతీరం

చదువుతోనే భవిష్యత్‌



తప్పెట్లమొర్సులో పత్తి పొలాల్లో పని చేస్తున్న బాలిక తల్లిదండ్రులతో మాట్లాడుతున్న అధికారుల బృందం

గట్టు: చదువుకుంటేనే మంచి భవిష్యత్‌ ఉంటుందని, ప్రతి విద్యార్థి తప్పని సరిగా పాఠశాలకు వెళ్లి చదువుకోవాలని జిల్లా ఎంప్లాయిమెంట్‌ అధికారిణి ప్రియాంక సూచించారు. శుక్రవారం తప్పెట్లమొర్సు గ్రామంలో బడి మానేసి, పొలాల్లో పనులు చేస్తున్న విద్యార్థులను గుర్తించి, వారి తల్లిదండ్రులతో ఆమె మాట్లాడారు. చదువుకుంటున్న చిన్నారులను ఎవరు కూడా పనుల్లో పెట్టుకోవద్దని హితువు పలికారు. 14 ఏళ్లలోపు చిన్నారుల చేత పనులు చేయించడం నేరమని తెలిపారు. 60 మంది బడి మానేసిన విద్యార్థులను గుర్తించి, వారి తల్లిదండ్రులను కలిసి, వారికి కౌన్సెలింగ్‌ నిర్వహించిన అనంతరం ఆ విద్యార్థులను మళ్లీ బడిలో చేర్పించారు. 10వ తరగతి విద్యార్థులకు భవిష్యత్‌ ప్రణాళిక, మోటివేషన్‌ క్లాసులను నిర్వహించారు. కార్యక్రమంలో నీతి అయోగ్‌ జిల్లా కోఆర్డీనేటర్‌ అఫ్జల్‌, ఎంపీడీఓ చెన్నయ్య, ఎంఈఓ నల్లారెడ్డి, హెడ్మాస్టర్‌ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందిని నియమించాలి

గద్వాల క్రైం: గద్వాల, అయిజ ప్రధాన పట్టణ కేంద్రాల్లో పెరుగుతున్న జనాభా దృష్ట్యా అయిజలో అర్బన్‌ పోలీసు స్టేషన్‌, సీఐ స్థాయి అధికారిని నియమించాలని బీజేపీ నాయకులు రామచంద్రరెడ్డి, శివారెడ్డి కోరారు. ఈమేరకు శుక్రవారంఎస్పీ శ్రీనివాసరావును కలిసి వినతి పత్రం అందజేశారు. గద్వాల పోలీసు స్టేషన్‌ పరిధిలో సీఐ స్థాయి స్టేషన్‌ అధికారులు అందుబాటులో ఉండాలని, శాంతి భద్రతల పరిరక్షణలో అవసరమయ్యే సిబ్బంది జిల్లాకు ఎంతో అవసరమన్నారు.

డబ్బాల తొలగింపుతో ఉద్రిక్తత



అలంపూర్‌లో మున్సిపల్‌ అధికారులతో వాగ్వాదానికి దిగిన దుకాణదారులు

- మున్సిపల్‌ అధికారులతో వ్యాపారుల వాగ్వాదం
- సమాచారం ఇవ్వకుండా ఎలా తొలగిస్తారని ఆగ్రహం
- ఎవరి డబ్బాలు వారే తొలగించుకోవాలని సూచన.. తొలగింపు వాయిదా

అలంపూర్‌: రోడ్డు పక్కన ఏర్పాటుచేసుకున్న డబ్బాలను మున్సిపల్‌ అధికారులు తొలగించేందుకు యత్నించగా.. ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఎలా తొలగిస్తారంటూ డబ్బాల యజమానులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఉద్రిక్తత నెలకొంది. పూర్తి వివరాలిలా.. అలంపూర్‌ మున్సిపాలిటీలోని రోడ్డు పక్కన వెలసిన డబ్బాలను మున్సిపల్‌ టౌన్‌ ప్లానింగ్‌ ఆఫీసర్‌ కురుమయ్య, ఎస్‌ఐ వెంకటస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం తొలగించడానికి జేసీబీలు, ట్రాక్టర్ల సాయంతో అక్కడికి చేరుకున్నారు. డబ్బాను తొలగిస్తుండగా ఇతర వ్యాపారులు అక్కడికి వచ్చి అడ్డుకున్నారు. ఏళ్లుగా ఇక్కడే డబ్బాలు ఏర్పాటుచేసుకొని చిరువ్యాపారాలతో జీవనం సాగిస్తున్నామని, ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఇలా తొలగిస్తే ఎలా అని ఆందోళన వ్యక్తం చేశారు. కొంత సమయం ఇస్తే మేమే తీసి వేస్తామనగా.. అందుకు అధికారులు ససేమీరా అనడంతో వాగ్వాదం మరింత పెద్దదైంది. ఈక్రమంలో దుకాణదారులు మున్సిపల్‌ కమిషనర్‌ సరస్వతిని కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు. దీంతో ఎవరి డబ్బాలు వారు తొలగించుకునే వెసులుబాటు కల్పించడంతో తొలగింపు ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోయింది.

డబ్బాలే జీవనాధారం..

అలంపూర్‌ మున్సిపాలిటీలో రోడ్డు పక్కన ఏళ్ల తరబడిగా కొంత మంది డబ్బాలు వేసుకొని జీవనం సాగిస్తున్నారు. చిరువ్యాపారాలు నిర్వహిస్తూ వచ్చే ఆ కొద్ది డబ్బులతోనే కుటుంబాలు నెట్టుకొస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో పట్టణ సుందరీకరణలో భాగంగా రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించారు. దీంతో రోడ్డు పక్కన ఉన్న డబ్బాలను తొలగించారు. అయితే, రోడ్డు విస్తరణ పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో తిరిగి వ్యాపారులు డబ్బాలు వేసుకున్నారు. తాజాగా మరోసారి తొలగించేందుకు మున్సిపల్‌ అధికారులు యత్నించగా తాము ఎలా బతికేది అంటూ వ్యాపారులు అడ్డుకోవడంతో ఉద్రిక్తతకు దారితీసింది.



డబ్బాలు తొలగించకుండా వారిస్తూ..

క్లుప్తంగా

మాదారంలో వివాహిత బలవన్మరణం



నవనీత (ఫైల్)

హన్వాడ: మాదారంలో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన మెండె నవనీత(26) మూడు సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ మేరకు తట్టుకోలేక గురువారం రాత్రి తన ఇంట్లోనే ఫ్యాన్‌కు చీర కొంగుతో ఉరివేసుకుంది. విషయంపై భర్త మెండె బాల్‌రాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు. కాగా నవనీత గురువారం గ్రామంలోని పలువురితో గొడవ కారణంగా మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వేపూర్‌లో మరొకరు..



శివకుమార్(ఫైల్)

హన్వాడ: వేపూర్‌కి చెందిన గోనెల శివ కుమార్(45) ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. శివకుమార్‌కు కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇటీవల వ్యాధి సంబంధిత నొప్పి అధికమైంది. దీంతో భరించలేక బుధవారం రాత్రి ఇంట్లోనే పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుర్తించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శివకుమార్ మరణించారు. ఆయన భార్య చంద్రమ్మ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు.

భార్యను వేధించిన భర్తపై కేసు నమోదు

జడ్చర్ల: కట్టుకున్న భార్యను మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేసిన భర్తపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ చంద్రమోహన్‌రావు తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని చౌటగడ్డతండాకు చెందిన ముడావత్ సరితతో భర్త ముడావత్ భాస్కర్ గురువారం గొడవ పెట్టుకొని మెడలోని తాళిని తెంచి వేడి నీటిని ఆమెపై పోశాడు. దీంతో శరీరంపై బొబ్బలు వచ్చాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే ఏనుగొండలోని ఎస్వీఎస్ ఆస్పత్రికి వైద్య చికిత్స నిమిత్తం తరలించారు. బాధితురాలి తల్లి కేతావత్ తారమ్మ శుక్రవారం ఫిర్యాదు చేయడంతో భాస్కర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

గుప్తనిధులు తవ్వడానికి వచ్చారంటూ.. ఫిర్యాదు

అమ్రాబాద్: లక్ష్మాపూర్(బీకే)గ్రామ సమీపంలోని నవనారసింహ ఆలయంలో గుప్తనిధుల తవ్వకాలపై మండలంలో కలకలం రేగింది. ఇందులో ఓ ప్రభుత్వ ఉద్యోగితో పాటు మరికొంత మంది ఉన్నట్లు గ్రామస్తులు అమ్రాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్థానికుల కథనం ప్రకారం.. గురువారం అర్ధ రాత్రి గ్రామంలోకి వచ్చిన ఓ కారును కొంతమంది గ్రామస్తులు అడ్డుకున్నారు. అందులో కారులో ఉన్న ఓ ప్రభుత్వ ఉద్యోగి రవి, మరోవ్యక్తి హరిలను ఇంత రాత్రి ఇక్కడ మీకేం పని ఉండి వచ్చారని ప్రశ్నించారు. దీంతో గ్రామంలో తమకు తెలిసిన వ్యక్తులను కలిసేందుకు వచ్చామని వారు సమాధానం ఇచ్చారు. కాగా అనుమానం వచ్చిన గ్రామస్తులు కారులో తనిఖీ చేశారు. కాగా అప్పటికే బైక్‌పై వస్తున్న మరో ముగ్గురు పారిపోయారు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించి వదిలేశారు. నవనారసింహ ఆలయంలో గుప్తనిధుల తవ్వకాలకే వచ్చారని శుక్రవారం అమ్రాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఘటన పై ఎస్‌ఐ రమేష్‌ను వివరణ కోరగా పరారీలో ఉన్న వారిని గుర్తించి విచారణ చేస్తామని తెలిపారు.



సామాన్యుడికి కూరగాయాలు

- ధరల మోతతో బెంబేలు
- బాగా తగ్గిన దిగుబడులు

నెలరోజుల వ్యవధిలో మార్కెట్లో ధరల వ్యత్యాసం

కూరగాయలు	గత నెలలో రూ.	ప్రస్తుతం ధర రూ.
టమాట	10	40
బీన్స్	60	80
బీర	80	100
దోస	60	80
వంకాయ	40	60
కాకర	30	60
పచ్చిమిర్చి	80	20
బెండ	40	60
దొండ	60	80
చిక్కుడు	60	80
క్యాప్సికం	60	80
గోకరకాయ	60	60
గోబీ	60	80
క్యాబేజీ	40	60
క్యారెట్	60	80



మార్కెట్‌లో కూరగాయలు కొనుగోలు చేస్తున్న మహిళలు

దిగుబడులు తగ్గుముఖం

జోగుళాంబ గద్వాల జిల్లాలో కూరగాయల దిగుబడులు తగ్గుముఖం పట్టాయి. ప్రతి సీజన్‌లో 4వేల ఎకరాల్లో కూరగాయలు సాగవుతున్నాయి. జిల్లాకు నెలకు 35వేల నుంచి 50వేల మెట్రిక్ టన్నుల కూరగాయలు అవసరం కాగా 60శాతం మేర ఉత్పత్తి అవుతున్నాయి. అవసరానికి ఇతర ప్రాంతాలపై ఆధారపడాల్సి వస్తోంది. ప్రస్తుత ఖరీఫ్ కాలంలో కూరగాయల పంట దిగుబడులు చేతికందే దశలో అకాల వర్షాలు ఎడతెరిపి లేకుండా కురవడంతో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. రైతులు కూరగాయలు పండించడానికి ఆసక్తి చూపుతున్నా ప్రతికూల పరిస్థితుల కారణంగా దిగుబడులు రావడం లేదు. సామాన్య, మధ్య తరగతి ప్రజానీకం ధరలను చూసి బెంబెలెత్తుతుంది. ఏ కూరగాయలను తీసుకున్నా కిలో రూ. 40–80మధ్య ధర పలుకుతున్నాయి.

గద్వాలటౌన్: శుభకార్యాలు ఏవైనా వంకాయ కూర కన్పించాల్సిందే. ఏ సీజన్‌లోనైనా ఇది అందరికీ అందుబాటులో ఉంటుంది. కానీ ప్రస్తుతం దీని ధర చుక్కలను తాకుతోంది. కూరగాయల మార్కెట్‌లో కిలో రూ. 60 పలుకుతుంది. గత నెల కిలో రూ. 40 ఉండేది.

■ పోషకాలు ఎక్కువగా ఉండే ఆకుకూరల ధరలు నీలకడ లేకుండా పోతున్నాయి. అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు పంటలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. అసలే వీటి సాగు అంతంతమాత్రం కావడంతో వినియోగానికి తగ్గట్టు సరఫరా లేదు. ఇటీవల అకాల వర్షాలతో పాదులు దెబ్బతినడంతో ఇటీవల వరకు ఆకుకూరలు 4 కట్టలు రూ.10లకు విక్రయిస్తే ఇప్పుడు రెండు చిన్నపాటి కట్టలే వస్తున్నాయి.

ఇవే కాదు.. ఇలా అన్నిరకాల కూరగాయల ధరలు ప్రస్తుతం ఆకాశంలో విహరిస్తున్నాయి. ఇందుకు అనేక కారణాలు కనిపిస్తున్నాయి. జిల్లాలో అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు కూరగాయల సాగుపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. రైతులను నష్టాలపాల్జేస్తుండగా, వినియోగదారులకు కూర 'గాయాలు' మిగులుతున్నాయి. గద్వాల, మల్దకల్, ధరూరు, వడ్డేపల్లి, రాజోలి తదితర మండలాల్లో ఆయా కాలాలకు అనుగుణంగా చిక్కుడు, బీరకాయ, కాకర, బెండ, చౌలకాయ, టమాట, మిరప, వంకాయ వంటి కూరగాయలు సాగు చేస్తున్నారు. రైతులు పంటలను ఆయా గ్రామాల నుంచి జిల్లా కేంద్రానికి తరలించి విక్రయిస్తుంటారు. కర్నూలు జిల్లా నుంచి క్యాబేజీ, క్యారెట్, క్యాప్సికం, దోస, బీట్‌రూట్, దొండ, బీన్స్, ఆలుగడ్డల వంటి కూరగాయలు గద్వాలకు సరఫరా అవుతున్నాయి.

ఇటీవల అకాల వర్షాల కారణంగా కూరగాయల తోటలకు చీడపీడలు సోకడంతో దిగుబడులు గణనీయంగా తగ్గిపోయాయి. రాబోవు రోజులు కార్తీక మాసం, అయ్యప్పస్వామి, ఆంజనేయస్వాముల దీక్షలతో పాటు పెళ్లిలు ఉండటంతో కూరగాయల వినియోగం ఎక్కువ కానుంది. దీంతో ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది. అసలే నిత్యావసర ధరలు, వంట నూనెలు నింగినంటుతుంటే కనీసం కూరగాయలు తినే పరిస్థితి లేకపోవడంపై వంటింటి గృహిణులు పెదవి విరుస్తున్నారు. నెల రోజుల కిందట అమాంతంగా తగ్గిన ధరలు ప్రస్తుతం పెరగడంతో మధ్య తరగతి వర్గానికి ఆశనిపాతంగా మారింది. ఒక టమోట ధరలు మాత్రమే గత నెలతో పోల్చితే నిలకడగా ఉన్నాయి. పచ్చిమిచ్చి ధరలు మాత్రం గత నెలతో పోల్చితే తక్కువగా ఉన్నాయి. మార్కెట్లో ఒకటి రెండు రకాల కూరగాయలు మినహా మిగతావన్నీ పావుకిలో రూ.20 పైనే పలుకుతున్నాయంటే పరిస్థితి ఎలా ఉందో ఊహించుకోవచ్చు. ఎల్లిగడ్డలు అయితే గత నెల కిలో రూ.240 ఉంటే ప్రస్తుతం రూ.520 చేరుకుంది.

ఏమీ కొనలేకపోతున్నాం



సంచి పట్టుకొని మార్కెట్‌కు వెళ్తే వందనోటు ఖర్చయిపోతుంది. సంచి నిండా కూరగాయలు రావడం లేదు. చేతిలో చిల్లిగవ్వ మిగలడం లేదు. ఏమీ కొనలేకపోతున్నాం. అన్ని సీజన్లలో ధరలు మండుతున్నాయి.

– రేణుక, గృహిణి, గద్వాల

ఖర్చులు రెట్టింపు



గతంలో కూరగాయలకు నెలకు రూ. 2వేల ఖర్చు చేస్తే ఇప్పుడు రెట్టింపు పైగా వ్యయం చేయాల్సి వస్తోంది. నాలుగు రోజుల క్రితం నాలుగు రకాల కూరగాయలు, ఉల్లిపాయలు కొనుగోలు చేస్తే రూ. 500 ఖర్చైపోయింది. ఇలా ధరలు పెరుగుతూ పోతే సామాన్యులు ఎలా బతుకుతారు. మధ్యతరగతి కుటుంబాల బడ్జెట్ తారుమారవుతోంది.

– శరణ్య, గృహిణి, గద్వాల

సామాన్యులపై భారం



కూరగాయలతో పాటు నిత్యవసరాల ధరలు పెరిగితే మాలాంటి సామాన్య, మధ్యతరగతి వారు ఎలా బతకాలి. పెరిగిన ధరల నేపథ్యంలో కొనలేక, అలాగని వినియోగించలేక ఇబ్బంది పడుతున్నాం. అధికార యంత్రాంగం తక్షణమే స్పందించి పెరిగిన ధరలను అదుపు చేయాలి.

– సావిత్రి, గృహిణి, గద్వాల

పలుగు రాళ్ల లారీలను అడ్డుకున్న యువకులు



రేవల్లి పోలీస్‌స్టేషన్ వద్ద పలుగురాళ్ల లారీలు


గోపాల్‌పేట: రేవల్లి మండలంలోని కేశంపేట పాతతండా వద్ద గురువారం రాత్రి పలుగు రాళ్లను తరలిస్తున్న నాలుగు లారీలను స్థానిక యువకులు అడ్డుకున్నారు. పలుగు రాళ్లను అక్రమంగా తరలిస్తున్నారని తహసీల్దార్ లక్ష్మీదేవికి ఫోన్‌లో సమాచారం ఇవ్వడంతో రెవెన్యూ సిబ్బంది అక్కడికి చేరుకొని లారీలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పలుగు రాళ్ల తరలింపుపై శుక్రవారం తహసీల్దార్ విచారణ చేపట్టారు. దీనిపై కలెక్టర్, మైనింగ్ అధికారులకు నివేదిక అందించామని.. వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు ఉంటాయని తహసీల్దార్ తెలిపారు. కాగా, సమగ్ర విచారణ జరిపి పలుగురాళ్ల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని స్థానిక యువకులు కోరారు.

మట్టి తరలింపును అడ్డుకున్న గ్రామస్తులు



అయిజ: మండలంలోని పులికల్ శివారులో మట్టిని తరలిస్తున్న వాహనాలను శుక్రవారం గ్రామస్తులు అడ్డుకున్నారు. పులికల్ రోడ్డు నిర్మాణానికి కాకుండా ఇతర ప్రాంతాలకు మట్టిని తరలిస్తున్నారని ఆందోళనకు దిగారు. గ్రామశివారులో ఎవరూ మట్టిని తరలించరాదని, వాహనాలను వెంటనే ఇక్కడి తీసుకెళ్లాలన్నారు. ఇక చేసేది లేక సదరు వ్యక్తులు మట్టి తవ్వకాలను నిలిపివేశారు.

జూరాలలో కొనసాగుతున్న విద్యుదుత్పత్తి



జూరాలలోని ఎగువ జల విద్యుత్ కేంద్రం

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి నిరంతరాయంగా కొనసాగుతోంది. శుక్రవారం 11 యూనిట్ల నుంచి ఉత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈలు సురేష్, సూరిబాబు తెలిపారు. ఎగువలో 5 యూనిట్ల నుంచి 196 మెగావాట్లు, 201.187 ఎం.యూ., దిగువలో 6 యూనిట్ల నుంచి 240 మెగావాట్లు, 174.750 ఎం.యూ. విద్యుదుత్పత్తి చేపట్టామన్నారు. ఇప్పటి వరకు ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రాల్లో 360.108 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి సాధించామని.. ఇందుకు 32,475 వేల క్యూసెక్కుల నీటిని వినియోగించినట్లు వివరించారు.

రామన్‌పాడుకు కొనసాగుతున్న వరద..

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయానికి శుక్రవారం వరద ఉధృతి కొనసాగింది. సరళాసాగర్, కోయిల్‌సాగర్ ప్రాజెక్టుల నుంచి వరద వచ్చి చేరుతుండటంతో అధికారులు అప్రమత్తమై రెండు గేట్లను ఎత్తి 10 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. జూరాల ఎడమ కాల్వ ద్వారా 809 క్యూసెక్కుల వరద వస్తుండగా.. సమాంతర కాల్వ ద్వారా నీటి సరఫరా నిలిపివేశారు. ఎన్టీఆర్ కాల్వకు 800 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వకు 20 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్టు ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి వివరించారు.

సుంకేసుల డ్యాంలో..

రాజోళి: సుంకేసుల డ్యాం ఒక గేటు తెరిచి నీరు విడుదల చేస్తున్నట్లు జేఈ రాజు తెలిపారు. శుక్రవారం ఎగువ నుంచి 6,891 క్యూసెక్కుల వరద రాగా.. ఒక గేటు తెరిచి 4,446 క్యూసెక్కుల నీటిని దిగువకు, కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కులు విడుదల చేసినట్లు పేర్కొన్నారు.

శ్రీశైలంలో 878.0 అడుగుల నీటిమట్టం..

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో శుక్రవారం 878.0 అడుగుల నీటిమట్టం, 177.9670 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాల నుంచి 1,05,630 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 32,491 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 446 క్యూసెక్కుల ప్రవాహం జలాశయానికి చేరింది. భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 36,904 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 4,471 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేశారు. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడుకు 12,792 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,430 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎంజీకేఎల్ఐకు నీటి విడుదల జరగలేదు. భూగర్భ కేంద్రంలో 14.871 మిలియన్ యూనిట్లు, కుడిగట్టు కేంద్రంలో 1.789 మి.యూ. విద్యుదుత్పత్తి చేశారు. స్థానికంగా 3.80 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

యువకుడిని కాపాడిన పోలీసులు

కృష్ణా: మండలంలోని ఖాన్‌దొడ్డికి చెందిన తారేష్ భార్యతో గొడవపడి మనస్తాపానికి గురై శుక్రవారం తన పొలంలో పురుగుమందు తాగాడు. ఈ విషయాన్ని స్థానిక పోలీసులకు ఫోన్‌చేసి తెలుపడంతో స్పందించి వెంటనే సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా గ్రామ పెద్దలకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకొని తారేష్‌ను మాగనూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రాణాపాయం తప్పిందని.. ప్రస్తుతం అతడి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యుడు తెలిపారు. తారేష్ ప్రాణాలు కాపాడిన కానిస్టేబుళ్లు రామ్‌తేజ, భరత్‌కు భార్య, తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

నగల షాపులో చోరీ

నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

అచ్చంపేట రూరల్: అచ్చంపేట పట్టణంలోని ఓ నగల షాపులో వెండి కాళ్ల పట్టీలను దొంగిలించిన మహిళా నిందితులను అచ్చంపేట పోలీసులు గుర్తించి అరెస్టు చేశారు. ఎస్‌ఐ రాము కథనం ప్రకారం... ఈనెల 16న పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర జువెలరీ షాపు వద్దకు నలుగురు మహిళలు వచ్చారు. అందులో ముగ్గురు షాపులోకి ప్రవేశించి యజమాని వెంకటరమణతో మాటామాటా కలిపారు. యజమాని దృష్టి మరల్చి ఒక మహిళ షాపులోని 10 జతల వెండి కాళ్లపట్టీలు (సుమారు రూ. లక్షా 80వేలు) దొంగిలించి వెళ్లిపోయారు. కాసేపటికి యజమాని పట్టీలు లేవని గుర్తించాడు. ఈ విషయంపై అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు షాపులోని సీసీ కెమెరాలను పరిశీలించారు. తిమ్మాజీపేట మండలం బాజీపూర్‌తండాకు చెందిన మూడావత్ బుజ్జి, మూడావత్ లక్ష్మి, మూడావత్ ఆస్లీలను నిందితులుగా గుర్తించారు. శుక్రవారం వారిని అరెస్టు చేశారు. వారి వద్ద ఉన్న 1 కేజీ 45గ్రాముల వెండినగలను రికవరీ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

కానిస్టేబుల్‌పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు

నాగర్‌కర్నూల్ (బిజినేపల్లి): మండల పోలీస్‌శాఖకు డబ్బుల ముసలం పట్టుకుంది. ఓ జంట నుంచి డబ్బులు వసూలు చేశారని రెండ్రోజుల కిందట ఇద్దరు కానిస్టేబుళ్లు సస్పెండ్ కాగా.. తాజాగా శుక్రవారం బిజినేపల్లి పోలీస్‌స్టేషన్‌లోని కానిస్టేబుల్ వినోద్‌రెడ్డి మరో ప్రేమ జంట విషయంలో కేసు పరిష్కరిస్తానంటూ రూ.రెండు వేలు తీసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గంగారం గ్రామానికి చెందిన సురేష్ పంచాయతీని అధికారితో మాట్లాడుతానంటూ డబ్బులు తీసుకొని వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న సురేష్ తాత నాగర్‌కర్నూల్ డీఎస్పీ, సీఐ, బిజినేపల్లి ఎస్‌ఐకి ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా బెల్టు దుకాణాలు, ఉన్నతాధికారులు లేకుండానే డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహించి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఫిర్యాదుపై ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డిని వివరణ కోరగా విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న పీయూ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి

పీయూలో ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పరిశోధనలు మానవ జీవితాన్ని సులభతరం చేస్తాయని.. విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పీయూ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. పీయూలో ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో మూడురోజుల పాటు జరిగిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం శుక్రవారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి అంశాన్ని పరిశోధన కోణంలో చూడటంతో విద్యార్థులకు కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలు వచ్చేందుకు ఆస్కారం ఉంటుందని, వాటిపై దృష్టి సారిస్తే జీవితంలో మరింత ఎదిగేందుకు ఆస్కారం ఉందని తెలిపారు. పరిశోధన క్రమంలో సమాచారం పక్కాగా ఉండాలని, సమాచార సేకరణలో శాస్త్రీయ పద్ధతులు ఎక్కువగా వినియోగిస్తే మంచి ఫలితాలు వస్తాయని వివరించారు. కార్యక్రమంలో ఇండియన్ అకౌంటింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రొ. అప్పారావు, మళ్చందర్‌గౌడ్, కన్వీనర్ జిమ్మీకార్టన్, చైర్మన్ చంద్రకిరణ్, కంట్రోలర్ రాజ్‌కుమార్, కుమారస్వామి పాల్గొన్నారు.

మామిడి సాగుకు ప్రోత్సాహం

- రాష్ట్ర ఉద్యాన అభివృద్ధి సంస్థ జనరల్ మేనేజర్ నర్సయ్య



మాట్లాడుతున్న రాష్ట్ర ఉద్యాన అభివృద్ధి సంస్థ జనరల్ మేనేజర్ నర్సయ్య

వీపనగండ్ల: మామిడి రైతులను ప్రోత్సహించాలన్న సదుద్దేశంతో భారత ప్రభుత్వం క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా ఉమ్మడి పాలమూరు జిల్లాను మామిడి క్లస్టర్‌గా ఎంపిక చేసిందని రాష్ట్ర ఉద్యాన అభివృద్ధి సంస్థ జనరల్ మేనేజర్ నర్సయ్య తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో మామిడి రైతుల అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 57 వేల ఎకరాల్లో మామిడి సాగవుతోందని.. క్లస్టర్ జిల్లాగా ఎంపిక చేయడంతో పంట కోత దశల్లో అవసరమైన ప్రోత్సాహకాలు అందజేస్తోందని వివరించారు. మార్కెటింగ్ సౌకర్యాన్ని విస్తృతపర్చి రైతులకు లాభం చేకూరే విధంగా చూస్తామన్నారు. శాస్త్రీయ పద్ధతుల్లో మామిడి తోటలు సాగుచేసి అధిక దిగుబడులు సాధించాలని జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారి నాగిరెడ్డి రైతులకు సూచించారు. ఎస్వీకే శాస్త్రవేత్త సురేష్‌కుమార్ రైతులకు పలు సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో మండల ఉద్యాన అధికారి కృష్ణయ్య, శివతేజ తదితరులు పాల్గొన్నారు.



గద్వాలలో నార్కోటిక్ అధికారుల తనిఖీలు

- నిషేధిత మత్తు పదార్థాలతో కల్లు తయారు, విక్రయాలపై ఆరా

గద్వాల క్రైం: జిల్లాలో నిషేధిత మత్తు పదార్థాలతో కల్లు తయారీ, విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు గద్వాల, మల్దకల్, తదితర కల్లు దుకాణాలపై నార్కోటిక్ అధికారుల బృందం శుక్రవారం దాడులు చేసింది. మొత్తం నాలుగు బృందాలుగా విడిపోయి గద్వాల మండలంలోని జమ్మిచెడ్, వీరాపురం, పూడూర్, మల్దకల్ మండలం మద్దెలబండా గ్రామాల్లో సోదాలు చేశారు. ఈక్రమంలో కల్లు సేవించిన 30మందికి అక్కడే టెస్టులు చేయగా పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు విశ్వసనీయ సమాచారం. కల్లు విక్రయదారులను సైతం అదుపులోకి తీసుకుని కల్లు తయారీకి వినియోగించిన మత్తు పదార్థాల వివరాలపై కూపీ లాగుతున్నారు. రాత్రి 9గంటల సమయంలో హైద్రాబాద్‌కు చెందిన (టీఎస్ ఎన్ఏబీ) ఎన్‌ఫోర్స్ మెంట్ విభాగ డీఎస్పీ, సీఐ స్థాయి సిబ్బంది ఈ దాడుల్లో పాల్గొన్నారు. ఇదిలాఉండగా, దాడుల విషయం తెలుసుకున్న ఇతర కల్లు విక్రేతలు పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది. దాడుల విషయమై ఎస్పీ శ్రీనివాసరావును సంప్రదించగా.. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని, నార్కోటిక్ అధికారులు నివేదికల ఆధారంగా చర్యలు ఉంటాయని అన్నారు.



గద్వాల రూరల్ పోలీసు స్టేషన్ వద్ద నార్కోటిక్ అధికారులు

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



మిడ్జిల్: మండలంలోని కొత్తపల్లి సమీపంలో ఉన్న లింబ్యాతండా దగ్గర శుక్రవారం రెండు బైక్‌లు ఢీకొని ఒకరు మృతిచెందగా.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. కొత్తపల్లికి చెందిన భానుప్రకాష్, ఆనంద్ రాణిపేట నుంచి కొత్తపల్లికి బైక్‌పై బయలుదేరారు. అదే సమయంలో లింబ్యాతండాలో మేస్త్రీ పనులు చేసేందుకు జడ్చర్ల నుంచి ఒంగోలుకు చెందిన నర్సింహా (40) బైక్‌పై వస్తుండగా తండా సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో గాయపడిన ముగ్గురిని స్థానికులు 108 వాహనంలో జడ్చర్ల ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నర్సింహా మృతిచెందాడు. ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు.

కల్తీ.. చంద్రబాబు సృష్టి

శ్రీవారి లడ్డూ విషయంలో సీఎం చంద్రబాబు చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలని తేలుతోంది: వైఎస్ జగన్

''రాజకీయ దుర్బుద్ధితో, పచ్చి అబద్ధాలతో తిరుమల లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసి చంద్రబాబునాయుడే తప్పు చేశాడు. దీనిపై విచారణకు ఆయనే సిట్ వేస్తాడు. ఆయన చెప్పు చేతుల్లో ఉన్న అధికారులతో సిట్ అంటాడు. ఇదెక్కడి ధర్మం? ఇదెక్కడి పద్ధతి? చంద్రబాబు ఈ మాదిరిగా హిందూ ధర్మం మీద దుష్ప్రచారం చేస్తూ రాజకీయం చేయడం ధర్మమేనా? ఆలోచించండి''

''నేను తిరుపతికి వెళ్లకూడదట..! దేవుడిని దర్శించుకోకూడదట..! కారణం నా మతం అంటున్నారు. నాలుగు గోడల మధ్య నేను బైబిల్ చదువుతా. తప్పేముంది? బయటకు వెళ్తే హిందూ సంప్రదాయాలను అనుసరిస్తా, గౌరవిస్తా. ఇస్లాంను అనుసరిస్తా, గౌరవిస్తా. సిక్కిజమ్‌ను అనుసరిస్తా, గౌరవిస్తా. నా మతం ఏమిటని అడుగుతున్నారు.. నా మతం.. మానవత్వం. డిక్లరేషన్‌లో రాసుకుంటారేమో రాసుకోండి''

''రాజ్యాంగం పీఠికలో ఏం చెప్పారు? ఇండియా ఈజ్ ఏ సావరిన్, సోషలిస్ట్, సెక్యులర్, డెమొక్రటిక్ రిపబ్లిక్ (భారత్ సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యం) సెక్యులర్ అంటే అర్థం తెలుసా? నీ మతం చెప్పకపోతే గుడిలోకి రావొద్దు అంటున్నావ్! ఇది సెక్యులర్ దేశం అంటున్నాం. సీఎంగా పని చేసిన వ్యక్తి పరిస్థితే ఇలా ఉంటే ఇక దళితులను గుడిలోకి పోనిస్తారా? రానిస్తారా?''

''మతం పేరుతో రాజకీయం చేయడం ఎంత దౌర్భాగ్యం? బీజేపీ నేతలు హిందుత్వానికి ప్రతినిధులుగా చెప్పుకుంటారు. మరి మీ కళ్లెదుటే మీ ఎన్డీఏ కూటమిలో భాగంగా ఉన్న వ్యక్తే శ్రీ వెంకటేశ్వరస్వామి విశిష్టతను, తిరుపతి లడ్డూ పేరు ప్రఖ్యాతులను, స్వామి వారి వైభవాన్ని దెబ్బతీసేలా సీఎం స్థాయిలో అబద్ధాలు చెబుతున్నారు. జంతువుల కొవ్వు వాడకపోయినా.. వాడి లడ్డూలు తయారు చేసినట్లుగా అబద్ధాలతో దుష్ప్రచారం చేసి వెంకటేశ్వరస్వామివారిని అపవిత్రం చేసిన చంద్రబాబును ఎందుకు మందలించడం లేదు? ఎందుకు వెనకేసుకొస్తున్నారు? అంటే మీవాళ్లు ఏం చేసినా ఫరవాలేదు. మిగిలిన వారు ఏం చేసినా తప్పే! ఇదెక్కడి హిందుత్వం? హిందుత్వానికి మీరు టార్చ్ బేరర్స్ అంటారు. అందరూ ఆలోచించండి''

''హిందుత్వం అంటే మానవత్వం చూపడం..! మానవత్వాన్ని చూపలేని వారు మంచి హిందువునని చెప్పుకోలేరు''

''హిందుత్వంపై బీజేపీ నేతలకు చిత్తశుద్ధి ఉంటే టీటీడీ పేరు ప్రఖ్యాతులు మంట కలిపి ఘోరం చేసిన చంద్రబాబును ఎలా ఉపేక్షిస్తున్నారు? ఎందుకు బుద్ధి చెప్పడం లేదు? ఎందుకు మందలించడం లేదు? చేసింది మన వాడే అనుకుని వదిలేస్తే ఏం సందేశం ఇస్తున్నట్లు?. మళ్లీ ఘోరమైన తప్పులు జరగొద్దు. అందుకు చంద్రబాబును మందలించాలి. మతాన్ని, దేవుణ్ని రాజకీయాల్లోకి తేకుండా చంద్రబాబుకు సుప్రీం కోర్టు నుంచి, ప్రధాని నుంచి చీవాట్లు పడాలి. అప్పుడైనా ఈ మనిషికి జ్ఞానం కలుగుతుంది''

– వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: తిరుమల శ్రీవారి లడ్డూ విషయంలో సీఎం చంద్రబాబు చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలని ఒక్కొక్కటిగా రుజువు అవుతూ కనిపిస్తున్నాయని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆ నాలుగు నెయ్యి ట్యాంకర్లను రిజెక్ట్ చేసి షోకాజ్ నోటీస్ ఇచ్చామని.. వాటిలో వనస్పతి ఆయిల్ కలిపినట్లు తేలిందని చాలా క్రిస్టల్ క్లియర్‌గా జూలై 23న ఈవో చెప్పిన రెండు నెలల తర్వాత సీఎం చంద్రబాబు సెప్టెంబరు 18న నెయ్యికి బదులు జంతువుల కొవ్వు వాడారని.. లడ్డూలు తయారు చేశారని.. వాటిని భక్తులు తిన్నారని పచ్చి అబద్ధాలాడారని మండిపడ్డారు. 'తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామిని ఎవరైతే అబద్ధాలతో అవమానించి అగౌరవపర్చాడో.. లడ్డూపై దుష్ప్రచారం చేశాడో.. ఆధారాలతో సహా కనిపిస్తున్న ఈ సత్యం బయటకు రావాలి. చంద్రబాబునాయుడు చేసిన ఈ పాపం కడగబడాలి. అది రాష్ట్ర ప్రజల మీదకు రావొద్దు. పాపం చేసిన చంద్రబాబు మీదే కట్టడి కావాలి. దాని కోసమే టాపిక్ డైవర్ట్ కాకూడదన్న ఉద్దేశంతో వెంకటేశ్వరస్వామిని ప్రేమించే వ్యక్తిగా, గౌరవించే వ్యక్తిగా నా పర్యటనను వాయిదా వేసుకున్నా'అని పేర్కొన్నారు. శుక్రవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడారు. లడ్డూ ప్రసాదంపై సీఎం చంద్రబాబు చేస్తున్న దుష్ప్రచారాన్ని సాక్ష్యాధారాలతో కడిగి పారేశారు. ఈ సందర్భంగా జగన్ ఏమన్నారంటే..

డైవర్షన్ పాలిటిక్స్..: తన 100 రోజుల పాలన గురించి ప్రజల దృష్టి మళ్లించేందుకు లడ్డూల టాపిక్ తెచ్చారు. గుడి పవిత్రత దెబ్బతీస్తూ అడ్డంగా దొరికిపోయే సరికి లడ్డూల టాపిక్‌ను డైవర్ట్ చేసేందుకు కొత్తగా డిక్లరేషన్ అంశాన్ని తెచ్చి రాజకీయం చేస్తున్నారు. తిరుమల పవిత్రత, స్వామివారి ప్రసాదం విశిష్టత, దేవస్థానం పేరు ప్రఖ్యాతులను రాజకీయ దుర్బుద్ధితో రచ్చకీడ్చి రాద్ధాంతం చేశారు. జంతువుల కొవ్వుతో లడ్డూలు తయారైనట్టుగా.. ఒక జరగని విషయాన్ని జరిగినట్లుగా.. ఆ కల్తీ ప్రసాదాన్ని భక్తులు తిన్నట్లుగా.. సీఎం స్థానంలో ఉన్న వ్యక్తి అబద్ధాలాడుతూ, అసత్యాలు పలుకుతూ స్వామి వారి పేరు ప్రఖ్యాతులను, తిరుపతి లడ్డూ విశిష్టతను దగ్గరుండి అపవిత్రం చేసే కార్యక్రమాన్ని సాక్షాత్తూ ఒక ముఖ్యమంత్రే చేస్తుంటే ఇంతకంటే దారుణం, అధర్మం ఎక్కడైనా ఉంటుందా? ఒక్కసారి ఆలోచించండి. చంద్రబాబు ఏ రకంగా అబద్ధాలు చెప్పి రెక్కలు కట్టాడనేది ఆధారాలతో చూపిస్తా. దీన్ని రాష్ట్ర ప్రజలే కాదు.. దేశ ప్రజలంతా గమనించాలని విజ్ఞప్తి చేస్తున్నా.


దశాబ్దాల ఆనవాయితీ..

తిరుమలలో లడ్డూల తయారీ కోసం నెయ్యి కొనుగోలు కార్యక్రమం దశాబ్దాలుగా జరుగుతోంది. ఆర్నెళ్లకు ఒకసారి ఈ–టెండర్ పిలుస్తారు. అర్హులు బిడ్ వేస్తారు. ఎల్–1 గా వచ్చిన వారికి టెండర్ ఖరారు చేస్తారు. ఇందులో ప్రభుత్వ ప్రమేయం ఉండదు. ఎల్–1గా వచ్చిన వారికి కూడా పూర్తి టెండర్ ఖరారు చేయరు. 65 శాతం వారికిచ్చి మిగతా వారిని కూడా రేటు తగ్గించాలని సూచించి వారికి టెండర్ ఇస్తారు. నా చిన్నప్పటి నుంచి చూస్తున్నా. తిరుపతి లడ్డూకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఆ టేస్ట్ మరెక్కడా ఉండదు. తాము సూచించిన ప్రముఖులను టీటీడీ బోర్డులో సభ్యులుగా నియమించాలని కేంద్ర మంత్రులు, ఇతర రాష్ట్రాల సీఎంలు కూడా రికమెండ్ చేస్తారు. అలాంటి ప్రముఖులతో బోర్డు ఏర్పాటవుతుంది. వారంతా దేవుడికి ఇంకా సేవ చేయాలని, భక్తులకు మంచి చేయాలని నిర్ణయాలు తీసుకుంటారు.

పటిష్ట సరఫరా వ్యవస్థ..: తిరుమలకు సరఫరా చేసే నెయ్యికి సంబంధించి రొబస్ట్ (పకడ్బందీ) విధానం ఉంటుంది. నెయ్యి సరఫరాదారులు ప్రతి ట్యాంకర్‌కు ఎన్ఏబీఎల్ (నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ క్యాలిబ్రేషన్ ల్యాబరేటరీస్) సర్టిఫై చేసిన క్వాలిటీ సర్టిఫికెట్ తేవాలి. అలా వచ్చిన నెయ్యిని కూడా ప్రతి ట్యాంకర్ నుంచి శాంపిల్ తీసి మూడు టెస్టులు చేస్తారు. అవన్నీ పాస్ అయితేనే ట్యాంకర్‌ను ముందుకు పంపుతారు. ఒక్క టెస్టు ఫెయిల్ అయినా ట్యాంకర్‌ను తిరిగి వెనక్కి పంపిస్తారు. 2014–19 మధ్య చంద్రబాబు హయాంలో 14 నుంచి 15 ట్యాంకర్లు అలా వెనక్కి వెళ్లాయి. మా ప్రభుత్వ హయాంలో 18 ట్యాంకర్లు వెనక్కు పంపారు. అంటే ఎవరూ తప్పు చేయలేని విధంగా అక్కడ రొబస్ట్ విధానం ఉంది. ఏ సరుకులైనా సరే క్వాలిటీ టెస్టులో ఫెయిల్ అయితే వెనక్కు పంపిస్తారు.

వాడని నెయ్యి.. తయారుకాని లడ్డూ..

ఇప్పుడు కూడా అదే జరిగింది. టీటీడీ ట్రస్ట్ బోర్డు అనుమతించిన బిడ్డర్లు జూన్ 12 నుంచి సరఫరా మొదలుపెట్టారు. అంటే అప్పటికే చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడింది. ఆ తర్వాతే నెయ్యి సరఫరా మొదలైంది. జూన్ 12, జూన్ 21, జూన్ 25, జూలై 4న వచ్చిన ట్యాంకర్లన్నీ టెస్టుల్లో పాస్ అయి ముందుకు కదిలాయి. వాటిని లడ్డూల తయారీలో వాడారు. ఆ తర్వాత జూలై 6న రెండు ట్యాంకర్లు, జూలై 12న మరో రెండు ట్యాంకర్లలో వచ్చిన నెయ్యి టీటీడీ టెస్టుల్లో ఫెయిల్ కావడంతో వెనక్కు పంపడానికి సిద్ధం చేశారు. సాధారణంగా మరోసారి ఆ శాంపిళ్లను పరీక్షించేందుకు మైసూర్‌లోని సీఎఫ్‌టీఆర్ఐ (సెంట్రల్ ఫుడ్ టెక్నాలజీ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్)కు పంపిస్తారు. కానీ ఇక్కడ మాత్రం గుజరాత్‌లోని ఎన్‌డీడీబీ (నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్)కి పంపారు. ఇది టీటీడీ చరిత్రలో తొలిసారి. టీటీడీ పంపించిన శాంపిల్స్‌పై ఎన్‌డీడీబీ జూలై 23న రిపోర్ట్ పంపింది. నెయ్యిలో కల్తీ ఉందన్న విషయం చెప్పారు. దాంతో ఆ ట్యాంకర్లను వెనక్కు పంపించారు. అలా 4 ట్యాంకర్లను వెనక్కు పంపడంతో పాటు ఆ కంపెనీకి షోకాజ్ నోటీస్ కూడా ఇచ్చారు. మరి ఆ నాలుగు ట్యాంకర్ల నెయ్యి వాడకపోయినా.. ఆ నెయ్యిని వాడారని రెండు నెలల తర్వాత సెప్టెంబరు 18న చంద్రబాబు ఉద్దేశపూర్వకంగా ఎందుకు అన్నారు? (చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక నియమించిన టీటీడీ ఈవో నెయ్యి నాణ్యత గురించి జూలై 23న ఏమన్నారో వీడియోను ప్రదర్శించారు). ఆ నాలుగు ట్యాంకర్లను రిజెక్ట్ చేశాం. షోకాజ్ నోటీస్ ఇచ్చామని, వాటిలో వనస్పతి ఆయిల్ కలిపినట్లు తేలిందని చాలా క్రిస్టల్ క్లియర్‌గా ఈవో చెప్పినా రెండు నెలల తర్వాత చంద్రబాబు సెప్టెంబరు 18న ఏ రకంగా అబద్ధాలు మాట్లాడారో చూడండి (ఆ వీడియో ప్రదర్శించి చూపారు). అన్నీ తెలిసినా.. నెయ్యికి బదులు జంతువుల కొవ్వు వాడారని.. లడ్డూలు తయారు చేశారని.. వాటిని భక్తులు తిన్నారని చంద్రబాబు అబద్ధాలు చెప్పారు.



టీడీపీ ఆఫీస్‌లో కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్..

చంద్రబాబు సెప్టెంబరు 18న ఆరోపణలు చేస్తే ఆ మర్నాడే.. అంటే సెప్టెంబరు 19న తెలుగుదేశం పార్టీ ఆఫీస్‌లో ఎన్‌డీడీబీ రిపోర్ట్‌ను రిలీజ్ చేశారు. నిజానికి అది కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్. అయినా దాన్ని టీడీపీ ఆఫీస్‌లో రిలీజ్ చేశారు. ఆ వెంటనే మర్నాడు అంటే సెప్టెంబరు 20 టీటీడీ ఈవో మళ్లీ ఏం మాట్లాడారో చూద్దాం.. (ఆ వీడియోను ప్రదర్శించారు). ట్యాంకర్లలో వచ్చిన నెయ్యిలో నాణ్యత లేదని తేలినందువల్ల ఆ నెయ్యిని వెనక్కి పంపామని, వాడలేదని చెప్పారు. అంతే కాకుండా సెప్టెంబరు 22న ఈవో స్వయంగా సంతకం చేసి ప్రభుత్వానికి ఒక నివేదిక కూడా ఇచ్చారు (అందులోని అంశాలు చదివి వినిపించారు). కల్తీ నెయ్యితో వచ్చిన ట్యాంకర్లను వెనక్కు పంపాం.. ఆ కంపెనీకి షోకాజ్ నోటీస్ కూడా ఇచ్చాం.. ఎన్‌డీడీబీ రిపోర్టు చాలా గోప్యమని అందులో ప్రస్తావించారు. మరి దాన్ని అంతకు ముందే తెలుగుదేశం పార్టీ ఆఫీస్‌లో రిలీజ్ చేశారు.

అది అపవిత్రత కాదా?

మళ్లీ సెప్టెంబరు 22న మీడియాతో మాట్లాడిన చంద్రబాబు అవే పచ్చి అబద్ధాలు వల్లించారు. కల్తీ నెయ్యి వాడారని చెప్పారు. స్వామివారి ప్రసాదం విశిష్టతను, తిరుమల ప్రతిష్టను, శ్రీ వెంకటేశ్వరస్వామివారి ప్రసాదం పేరు ప్రఖ్యాతులను రాజకీయ లబ్ధి కోసం ఇలా అబద్ధాలతో తగ్గించడం, కుట్రపూరితంగా వ్యవహరించడం అపవిత్రత కాదా?

ఎన్‌డీడీబీ రిపోర్ట్ కచ్చితమైనది కాదు..

పోనీ.. ఆ ఎన్‌డీడీబీ రిపోర్టు అయినా కచ్చితమైందా? అని చూస్తే ఆ రిపోర్టులో వాళ్లే డిస్‌క్లెయిమర్ రాశారు. 'నెయ్యిలో ఉండాల్సిన స్టాండర్డ్ వాల్యూ కన్నా శాంపిల్స్‌లోని స్టాండర్డ్ వాల్యూస్‌లో డీవియేషన్స్ ఉన్నాయి. అయినా ఈ పరిస్థితుల్లో ఒక ఫాల్స్ పాజిటివ్ ఫలితం కూడా రావొచ్చు. (ఆ పరిస్థితులు ఏమిటంటే అని వివరిస్తూ పాల సేకరణ, ఆవులు, వాటికి అందించే దాణా గురించి ప్రస్తావించారు). అలాగే ఆవులకు సరైన ఆహారం లేనప్పుడు, అవి సరిగ్గా తినకుండా బలహీనంగా ఉన్నప్పుడు తీసిన పాల నుంచి కూడా ఇలాంటి ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు.

పచ్చి అబద్ధాలు. అపవిత్రం కాదా?

ఇవన్నీ తెలిసినా చంద్రబాబు కావాలని అబద్ధాలాడుతున్నారు. ప్రసాదం స్వీకరించే ప్రతి ఒక్కరిలో అనుమానపు బీజాలు రేకెత్తించడం దుర్మార్గం కాదా? నీ రాజకీయ స్వార్థం కోసం వెంకటేశ్వర స్వామి ప్రతిష్టను దిగజారుస్తున్నావు చంద్రబాబూ! స్వామి ప్రసాదానికి సంబంధించిన విశిష్టతను దిగజారుస్తున్నావ్. జరగనిది జరిగినట్లుగా.. జంతువుల కొవ్వుతో ప్రసాదం తయారు చేసినట్లుగా అబద్ధాలను ప్రచారం చేస్తున్నావు. ఇది ధర్మమేనా?

మీ హయాంలో ఎందుకు వాడలేదు?

నందిని బ్రాండ్ ఎందుకు వాడడం లేదని అంటున్నారు. మరి గతంలో చంద్రబాబు పాలన సమయంలో 2015 నుంచి 2018 అక్టోబరు వరకు కేఎంఎఫ్‌కు చెందిన నందిని బ్రాండ్ నెయ్యి ఎందుకు లేదు? అప్పుడు కూడా టెండర్లు పిల్చారు కదా?

అప్పుడు ఇంత కంటే తక్కువ ధరకే..

రూ.320కి కిలో నెయ్యి ఎలా వస్తుందని చంద్రబాబు అంటారు. మరి చంద్రబాబు 2014–19 మధ్య నెయ్యిని ఏ ధరకు సేకరించారు? ఇప్పుడు కూడా అదే క్వాలిటీ నెయ్యి కదా? దశాబ్దాలుగా అదే క్వాలిటీ. అదే నెయ్యి. చంద్రబాబు హయాంలో 2015లో కిలో నెయ్యి రూ.276కి కొన్నారు. అదే 2019 జనవరిలో కిలో ఆవు నెయ్యిని రూ.324కు కొన్నారు. మరి ఇక్కడ రూ.320కి కొంటే తప్పేం జరిగింది?

ఇది రాక్షస రాజ్యం కాదా?

''రాష్ట్రంలో గతంలో ఎన్నడూ చూడని రాక్షస రాజ్యం నడుస్తోంది.. దేవుడిని దర్శించుకునే కార్యక్రమాన్ని కూడా అడ్డుకుంటున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు, కార్యకర్తలకు పోలీసులు నోటీసులు ఇచ్చారు. నా రాజకీయ జీవితంలో ఇలాంటి రాక్షస రాజ్యాన్ని రాష్ట్రంలోనే కాదు.. దేశంలో కూడా చూడలేదు''అని మాజీ సీఎం వైఎస్ జగన్ మండిపడ్డారు. (తిరుమల వెళ్లకుండా వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పోలీసులు ఇచ్చిన నోటీసులను ఈ సందర్భంగా ఆయన చదివి వినిపించారు). 'జగన్ అనే వ్యకి మాజీ ముఖ్యమంత్రి. ఆయన దేవుడిని దర్శించుకునేందుకు తిరుమల వెళ్తుంటే.. మీకు పర్మిషన్ లేదు.. మీరు వెళ్తే అరెస్టు చేస్తామని నోటీసులు ఇస్తున్నారు. దీనిపై అందరూ ఒక్కసారి ఆలోచన చేయండి'అని విజ్ఞప్తి చేశారు. 'ఏ ప్రపంచంలో ఉన్నాం? ఇది రాక్షస రాజ్యం కాదా? ఒకవైపు నన్ను వెళ్లనివ్వకుండా చేసి వైఎస్సార్‌సీపీ శ్రేణులు వెళ్లకుండా నోటీసులు ఇస్తున్నారు. మరోవైపు చుట్టుపక్కల రాష్ట్రాల నుంచి బీజేపీ శ్రేణులను రప్పిస్తున్నారు. ఇది ఆ పార్టీ నాయకత్వానికి తెలుసో? లేదో? వేల మంది పోలీసులను మోహరించారు. టాపిక్ డైవర్షన్ కోసం ఎందుకింత ఆరాటం?'అని సీఎం చంద్రబాబును నిలదీశారు.

ప్రతి గుడిలో పూజలు చేయండి..

నేను గుడికి వెళ్లలేకపోయినా ఫరవాలేదు. కానీ చంద్రబాబు చేసిన పాపానికి ప్రాయశ్చిత్తంగా మన పార్టీ తరఫున మీ ఊళ్లలో పూజలు చేయండి. తప్పు చేసింది మేం కాదు.. చంద్రబాబు అని వేడుకోండి. ఆ కోపాన్ని ప్రజలపై కాకుండా చంద్రబాబుపై చూపమని వేడుకోమని కోరుతున్నా. వైఎస్సార్‌సీపీ అభిమానులే కాదు.. రాష్ట్ర శ్రేయస్సు కాంక్షించే ప్రతి ఒక్కరినీ కోరుతున్నా. చంద్రబాబు చేసిన పాపం వల్ల వెంకటేశ్వరస్వామికి కోపం వచ్చి రాష్ట్రం మీద చూపకుండా, కోపం కేవలం చంద్రబాబుమీదే చూపించే విధంగా పూజలు చేయండి. ఎందుకంటే జరిగింది ఘోర అపచారం. వెంకటేశ్వరస్వామిని పలుచన చేస్తూ, ఆయన ప్రసాదాన్ని లోకువ చేస్తూ.. జరగనిది జరిగినట్లుగా.. జంతువుల కొవ్వు వాడనిది వాడినట్లుగా, ఆ లడ్డూలు పంపిణీ చేసినట్లుగా.. పచ్చి అబద్ధాలాడుతూ ఇంత ఘోరం చేసిన వ్యక్తి చంద్రబాబు. ఆ పాపం కడగబడాలి. అందుకే అందరినీ కోరుతున్నా. పూజలు చేయమని వేడుకుంటున్నా.

నా డిక్లరేషన్ కోరడం ఏమిటి?

''చంద్రబాబు పాపాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్న నేపథ్యంలో ప్రజలంతా ఆయన్ను వేలెత్తి చూపుతుండటంతో టాపిక్ డైవర్షన్ కోసమే డిక్లరేషన్ అంటున్నాడు. జగన్ ఇవాళ ఏమైనా కొత్తనా? రాజశేఖర్‌రెడ్డిగారు కొత్తనా? ఆయన ఏమిటో తెలియదా? నా మతం ఏమిటో రాష్ట్రంలో, దేశంలో తెలియదా? నా కులం ఏమిటో తెలియదా? రాజశేఖర్‌రెడ్డిగారు సీఎంగా 5 ఏళ్లు వరుసగా స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. నేనూ గతంలో చాలాసార్లు వెళ్లాను కదా! సీఎం కాక ముందు కూడా వెళ్లాను కదా! అంతెందుకు.. నా పాదయాత్ర మొదలుపెట్టే ముందు కూడా స్వామివారిని దర్శించుకున్నా. 3,648 కిలోమీటర్ల పాదయాత్ర ముగిసిన తర్వాత తిరుపతి నుంచి కాలి నడకన కొండ ఎక్కా. స్వామివారిని దర్శించుకున్న తర్వాతే ఇంటికి వెళ్లా. అప్పుడు ఉన్నది చంద్రబాబు ప్రభుత్వం. నేను ప్రతిపక్ష నాయకుడిని. రెండు సార్లు స్వామివారిని దర్శించుకున్నాను కదా? ఆ తర్వాత సీఎంగా వరుసగా 5 ఏళ్లు స్వామివారికి భక్తి శ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా బ్రహ్మోత్సవాల్లో పట్టువస్త్రాలు సమర్పించాను కదా? ఎన్నోసార్లు స్వామి వారిని దర్శించుకున్నా. తొలిసారి ఎవరైనా వెళ్తుంటే అడగొచ్చు. కానీ 10, 11 సార్లు వెళ్లిన తరువాత.. ఈరోజు నేను తిరుపతి వెళ్తానంటే అడ్డుకుంటూ నోటీసులు ఇవ్వడం ఏమిటి?. డిక్లరేషన్ అడగడం ఏమిటి? మా ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లకు నోటీసులు పంపడం ఏమిటి?''అని వైఎస్ జగన్ సూటిగా ప్రశ్నించారు.

చైర్మన్ గిరి కోసం నిరసన

- స్థానికులకే ఇవ్వాలంటున్న ఊర్కొండ నాయకులు



నిరసనలో పాల్గొన్న నాయకులు

ఊర్కొండ: ఊర్కొండపేట ఆంజనేయస్వామి ఆలయ చైర్మన్ పదవిని స్థానికులకే ఇవ్వాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఇటీవలే నోటిఫికేషన్ వచ్చిన నేపథ్యంలో గ్రామానికి చెందిన పలువురితో పాటు మండల నాయకులు సైతం పోటీ పడుతున్నారు. గురువారం రాత్రి ఎమ్మెల్యే సంతకం ఉన్న లెటర్ తెరమీదికి రావడంతో గ్రామ నాయకుల్లో అలజడి మొదలైంది. దీంతో శుక్రవారం ఆలయం వద్ద ఎమ్మెల్యే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నిరాహార దీక్షలు చేపట్టారు. మాజీ చైర్మన్ నర్సిరెడ్డి మాట్లాడారు. సమాచారం ఇవ్వకుండా స్థానికేతరుడికి పదవి కట్టబెట్టేందుకు ప్రయత్నాలు సరికావన్నారు. తమలో ఒకరికి పదవి కేటాయించాలన్నారు. వేరే వ్యక్తికి ఇస్తే గ్రామస్తులతో కలిసి పాలకవర్గాన్ని సైతం అడ్డుకుంటామని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకుడు శేఖర్ రెడ్డి, ఉత్సవ కమిటీ మాజీ సభ్యులు మనోహర్, అంజయ్య, శ్రీనివాసులు, అశోక్, చంద్రయ్య, శ్రీశైలం, ప్రవీణ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

ముగిసిన రీజినల్ ఫారెస్ట్ స్పోర్ట్స్ మీట్



విజేతలకు ట్రోఫీలు అందజేస్తున్న అధికారులు

పాలమూరు: మహబూబ్‌నగర్‌లోని ప్రధాన స్టేడియం మైదానంలో నిర్వహించిన రీజినల్ ఫారెస్ట్ స్పోర్ట్స్ మీట్ శుక్రవారం ముగిసింది. రెండు రోజులపాటు కొనసాగిన స్పోర్ట్స్ మీట్‌లో ఉమ్మడి జిల్లాకు సంబంధించిన 180 మంది అటవీ శాఖ అధికారులు, సిబ్బంది క్రీడల్లో పాల్గొన్నారు. చివరిరోజు మహిళా సిబ్బందికి ఇండోర్ గేమ్స్ బ్యాడ్మింటన్, చెస్, క్యారమ్స్, రైఫిల్ షూటింగ్, క్రికెట్, టగ్‌ఫర్ నిర్వహించారు. విజేతలుగా అమ్రాబాద్ అటవీ శాఖ వారు గెలుపొందారు. వారితోపాటు వ్యక్తిగతంగా, జట్టుగా గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఉమ్మడి జిల్లా నుంచి రాష్ట్రస్థాయికి 35 మంది అటవీ శాఖ అధికారులు, సిబ్బందిని ఎంపిక చేశారు. మహబూబ్‌నగర్ డీఎఫ్ఓ సత్యనారాయణ, వనపర్తి డీఎఫ్ఓ నవీన్‌రెడ్డి, రాంమోహన్, రాంమూర్తి, తిరుమల్‌రావు పాల్గొన్నారు.

నిరీక్షణకు తెర..



కొనపాలమూరు పాఠశాలలో బోధిస్తున్న ఉపాధ్యాయిని

- ఎట్టకేలకు 2008 డీఎస్సీ అభ్యర్థులకు టీచర్ ఉద్యోగాలు
- కాంట్రాక్టు పద్ధతిలో నియామకానికి ప్రభుత్వం చర్యలు
- కొనసాగుతున్న సర్టిఫికెట్ల పరిశీలన
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 370 మంది అభ్యర్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం 16 ఏళ్లుగా ఎదురుచూస్తున్న డీఎస్సీ–2008 అభ్యర్థులను కాంట్రాక్టు పద్ధతిలో నియమించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా 370 మంది అభ్యర్థులు సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కావాలని రెండు రోజుల క్రితం సంబంధిత అధికారులు సమాచారం ఇచ్చారు. ఇప్పటి వరకు 80 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. మిగతా అభ్యర్థులు సర్టిఫికెట్ల పరిశీలనకు రాకపోవడానికి గల కారణాలపై అధికారులు తర్జన భర్జన పడుతున్నారు. అయితే సర్టిఫికెట్ల పరిశీలనకు వచ్చే నెల 5వ తేదీ వరకు అవకాశం కల్పించారు.

సర్టిఫికెట్లు పరిశీలిస్తున్నాం..



ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 370 మంది అభ్యర్థులు ఉండగా.. సర్టిఫికెట్ల పరిశీలనకు 80 మంది మాత్రమే హాజరయ్యారు. వచ్చే నెల 5వ తేదీ వరకు మహబూబ్‌నగర్ డీఈఓ కార్యాలయంలో సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగుతుంది. తప్పనిసరిగా సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యారు.

– రవీందర్, డీఈఓ, మహబూబ్‌నగర్

కొన్నేళ్లుగా ఎదురుచూపులు..

డీఎస్సీ–2008లో బీఈడీ, డీఈడీ అభ్యర్థులకు ఉద్యోగాల కేటాయింపు విషయంలో కోర్టు కేసు కావడంతో మెరిట్‌లో ఉన్న అభ్యర్థులు సంవత్సరాల తరబడి ఎదురుచూసే పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే 2008 డీఎస్సీలో నష్టపోయిన అభ్యర్థులకు న్యాయం చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చింది. అయితే కోర్టు కేసుకు సంబంధించి పూర్తిస్థాయిలో స్పష్టత రాకపోవడంతో కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగాలు ఇచ్చేందుకు కసరత్తు చేపట్టింది. అయితే ఎస్టీటీ పేస్కేల్‌కు సమానంగా వేతనంగా ఉంటుందని సమాచారం. ఈ కాలయాపనతో కొందరు అభ్యర్థులు ఇతర ఉద్యోగాలు పొందడం.. మరికొందరు వ్యాపార రంగాల్లో స్థిరపడినట్లు తెలుస్తోంది. సర్టిఫికెట్ల పరిశీలనకు వచ్చిన అభ్యర్థులు మాత్రం నిరీక్షణకు ప్రతిఫలం లభించిందని పేర్కొంటున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

మహబూబ్‌నగర్ క్రైం: బాలబాలికలు క్రమశిక్షణగా ఉంటూ చదువుపై దృష్టిపెడితే ఉత్తమ భవిష్యత్ లభిస్తోందని డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా సురక్ష కళా బృందం, మహిళా పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లాకేంద్రంలోని సరోజని రాములమ్మ ఫార్మసీ కళాశాలలో మానవ అక్రమ రవాణా నిరోధకం అనే అంశంతోపాటు షీటీంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు చూపించే మోసపూరిత ఆశలు, గిఫ్టులు, మేసేజ్‌లకు ఎవరూ మోసపోరాదన్నారు. ఆన్‌లైన్‌లో బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ చెప్పరాదని, ఎవరైనా సైబర్ నేరానికి గురైతే సైబర్ క్రైం హెల్ప్‌లైన్ 1930 లేదా సెల్ నం.8712659360కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాల అక్రమ రవాణా, వినియోగం వల్ల భవిష్యత్‌లో యువత ప్రమాదంలో పడుతుందన్నారు. మత్తు పదార్థాల బారినపడిన ఎంతోమంది భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కొందరు జల్సాలకు అలవాటుపడి డబ్బు సంపాదన కోసం అక్రమ మార్గాల్లో గంజాయి, ఇతర మత్తు పదార్థాలను విక్రయిస్తున్నారన్నారు. మత్తు పదార్థాల గురించి చీటి ఊజట్బ్రురు ఘట. ఞా జీభ్ఃజర్భుజీ .ఛౌరు కు సమాచారం ఇవ్వాలని సూచించారు. బాల్య వివాహాలతో అనేక అనర్థాలు జరుగుతాయని, ఎవరూ కూడా బాల్య వివాహాలు చేసుకోరాదని సూచించారు. ఎవరైనా బాల్య వివాహాలు జరిపిస్తుంటే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ గాంధీనాయక్, ఉమెన్ సీఐ శ్రీనివాస్, కళాశాల చైర్మన్ బాలరాజు పాల్గొన్నారు.

పాఠశాలలను పరిశీలించిన అధికారులు



కూచూర్ పాఠశాలలో నాబార్డు అధికారుల బృందం

నవాబుపేట: రాష్ట్రస్థాయి నాబార్డు అధికారి షణ్ముకాచారీ, తదితరులు శుక్రవారం చౌడూర్, కొల్లూర్, పోమాల్, రుద్రారం, కూచూర్ పాఠశాలలను సందర్శించారు. గతంలో మన ఊరు మన బడి కింద మంజూరై కొనసాగిన, పెండింగ్‌లో ఉన్న పనులపై ఆరా తీశారు. డిజిటల్ తరగతి గదులు, తాగునీటి వసతులు, విద్యుత్ తదితర ఏర్పాట్లపై విద్యార్థులతో, ఉపాధ్యాయ బృందాలతో చర్చించారు. అనంతరం పాఠశాలలో ఇంకా పెండింగ్‌లో ఉన్న వాటిపై ఆరా తీసి వివరాలు సేకరించారు. మండల విద్యాశాఖ అధికారి నాగ్యనాయక్, ఏఈ జాక్యనాయక్, సీఆర్పీ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక దృఢత్వం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి జితేందర్

- ఉత్సాహంగా జోనల్‌స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలు
- పాల్గొన్న ఉమ్మడి జిల్లా క్రీడాకారులు

గద్వాలటౌన్: క్రీడలు శారీరక దృఢత్వానికి, మానసిక వికాసానికి తోడ్పడతాయని జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి (డీవైఎస్ఓ) అధికారి బీఎస్ ఆనంద్ అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో అండర్ –14 బాలుర జోనల్‌స్థాయి క్రికెట్ పోటీలు జరిగాయి. ఉమ్మడి జిల్లాలోని అయిదు జిల్లా జట్ల క్రీడాకారులు పోటీలలో పాల్గొన్నారు. పోటీలను ప్రారంభిన అనంతరం డీవైఎస్ఓ బీఎస్ ఆనంద్ క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. గెలుపు ఓటముల కంటే పోటీల్లో క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించడం ప్రధానమని పేర్కొన్నారు. అనంతరం జోనల్ స్థాయిలో ప్రతిభ చాటిన 25 మంది క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. వీరికి వచ్చేనెల 3, 4వ తేదీలలో శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేసి తుది జట్టు ఎంపిక చేస్తామని పోటీల కన్వీనర్ శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోచ్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీలు..

ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎస్ఆర్ విద్యానికేతన్ క్రీడా మైదానంలో అండర్ –17 బాలుర, బాలికల జోనల్‌స్థాయి ఫుట్‌బాల్ పోటీలు వేరువేరుగా జరిగాయి. ఉమ్మడి జిల్లాలోని అయిదు జిల్లా జట్ల క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. పోటీలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి జితేందర్ ప్రారంభించారు. పట్టుదల, శ్రద్ధ అనేది క్రీడల వల్ల అలవడతాయని, క్రీడలు జీవితానికి గొప్ప స్ఫూర్తినిస్తాయని, అందువల్ల వాటిని తప్పని సరిగా ప్రోత్సహించాలని ఆయన సూచించారు. లీగ్ కం నాకౌట్ పద్ధతిలో జరిగిన పోటీలలో బాలికల విభాగం నుంచి గద్వాల జిల్లా జట్టు విన్నర్‌గా... మహబూబ్‌నగర్ జిల్లా జట్టు రన్నర్‌గా నిలిచింది. బాలుర విభాగంలో నారాయణపేట జిల్లా జట్టు విజేతగా.. గద్వాల జిల్లా జట్టు రన్నర్‌గా నిలిచింది. గెలుపొందిన జట్లుకు మెమోంటోలను అందజేశారు. ప్రతిభ చాటిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పోటీల కన్వీనర్ నగేష్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బీసన్న, సతీష్‌కుమార్, పీఈటీలు హైమావతి, బషీర్, ఆనంద్, స్వాతి, ప్రవంతి, వడ్డెన్న, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ క్రీడాకారులతో డీవైఎస్ఓ బీఎస్

మూడుగా చీలిన మహావృక్షం



జడ్చర్ల పట్టణంలోని పెద్దగుట్ట వెనకాల ఉన్న హలీంకలీంషా దర్గా ఎదురుగా ఉన్న 302 ఏళ్ల నాటి మహావృక్షం(రావి చెట్టు) చీలిపడిపోయింది. దర్గా ప్రారంభమైన సమయం నుంచి ఉన్న ఈ రావి చెట్టు గురువారం రాత్రి వర్షం, ఈదురు గాలుల వల్ల మూడు పాయలుగా విడిపోయింది. రెండుపాయలు పూర్తిగా పడిపోయాయి.

– జడ్చర్ల టౌన్